

విషమ 'పరీక్ష'
ఎదురుగా వచ్చిన రెండు ఆటోలను కారు ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్రగాయాలు, ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. - 8లో..



ప్రైజ్‌మనీ పేరుతో కుచ్చుటోపీ
ప్రైజ్‌మనీ పేరుతో ఫేక్ మేసేజ్‌లు పంపి డబ్బు కట్టించుకుని మోసగించారని బాధితుడు ఎస్పీ మలికాగర్గ్‌కు ఫిర్యాదు చేశాడు. - 8లో..

గరిష్టం/కనిష్టం
35 /29

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణం పొడిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు ఒంగోలు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈనెల 10న ఒంగోలు రానున్నట్లు ఒంగోలు ఎంపీ కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానికంగా జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు స్థానిక బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలోని ఎర్రన భవనంలో జరిగే జిల్లా టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 3 గంటలకు ప్రకాశం భవనంలోని స్పందన సమావేశ మందిరంలో జరిగే దిశ కమిటీ/జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం తన కార్యాలయంలో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



వాటర్ ప్లాంట్ నిర్వాహకులతో సమావేశం నిర్వహిస్తున్న జేసీ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: తాగునీటి వాటర్ ప్లాంట్‌లు నిర్వహించే వాళ్లు తప్పనిసరిగా ఆహార భద్రత ప్రమాణాలు, నాణ్యత ప్రమాణాలు పాటించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం వాటర్ ప్లాంట్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వాటర్ ప్లాంట్‌ల నిర్వహణకు తప్పనిసరిగా అనుమతి ఉండాలని, సంబంధిత డిపార్ట్‌మెంట్‌లో అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతులు తీసుకోని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిలో జిల్లా ఆహార భద్రతా అధికారి అశోక్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎరువు కరువు తీరేలా..

రైతులు పంటల సాగుకు దుక్కి దున్నే సమయం నుంచి పండించిన పంటలను గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేసే వరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్నీ రాష్ట్ర ప్రభుత్వమే దగ్గరుండి చూసుకుంటోంది. రైతులకు అవసరమైన ఎరువుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా గ్రామంలోని ఆర్బీకేలోనే అందుబాటులో ఉంచింది. వచ్చే ఖరీఫ్ సీజన్ కోసం అవసరమైన ఎరువులను ముందుగానే సిద్ధం చేసింది. ఎరువులు పుష్కలంగా అందుబాటులో ఉండటం, సాగునీటికి ఇబ్బందులు లేకపోవడంతో రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు.

- ఖరీఫ్ సీజన్ కోసం 86,133 టన్నులు సిద్ధం
- వాటిలో గత సంవత్సరం మిగులు నిల్వలు 26,940 టన్నులు
- ఈ ఏడాది ప్రతిపాదన పంపింది 59,193 టన్నులు
- ఆర్‌బీకేల ద్వారా 17,168 టన్నులు రైతులకు ఇచ్చేందుకు అందుబాటులో
- ఖరీఫ్ సీజన్‌లో 1.57 లక్షల హెక్టార్లలో పంటల సాగు లక్ష్యం



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు పుష్కలంగా పండుతున్నాయి. సీజన్ల వారీగా రుతు పవనాలు సకాలంలో వస్తున్నాయి. వరుణుడు కరుణించడంతో గంగమ్మ పరవళ్లు తొక్కుతోంది. పశ్చిమ ప్రాంతంలో సైతం భూగర్భ జలాలు పుష్కలంగానే ఉన్నాయి. వేసవిలో సైతం జిల్లాలో గత వారం నుంచి జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జూన్ నెలలో వచ్చే ఖరీఫ్ సీజన్ కోసం రైతులు ఇప్పటి నుంచి సన్నాహాలు ప్రారంభించారు.

ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి రైతులను ఆదుకునేందుకు అన్ని విధాలా చేయూతనందిస్తున్నారు. గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేయటంతో పాటు గ్రామాల వారీగా రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) ఏర్పాటు చేసి మండల కేంద్రాలకు, రెవెన్యూ డివిజన్ కేంద్రాలకు రైతులు వెళ్లే అవసరం లేకుండా అన్నీ గ్రామ సీమల్లోనే రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. అందులో భాగంగా ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే ఎరువులను రైతులకు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది జిల్లా వ్యవసాయ శాఖ. ఖరీఫ్ సీజన్‌కు రైతులు పంటల సాగు చేసుకునేందుకు గాను పెట్టుబడి సాయాన్ని మే నెలలోనే ఇచ్చేలా చర్యలు చేపట్టనుంది. అందుకోసం ఉన్న రైతు భరోసా పథకం కింద ఏడాదికి రూ.13,500 అందించేందుకు గతంలో ఉన్న లబ్ధిదారులతో పాటు నూతనంగా అర్హులైన రైతులను లబ్ధిదారులుగా చేర్చేందుకు ఇప్పటికే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. రైతులకు దరఖాస్తులు ఆహ్వానించి లబ్ధిదారులు ఎంపిక ప్రక్రియ చేపడుతున్నారు.

ఖరీఫ్ కోసం 86,133 టన్నులు సిద్ధం

ఖరీఫ్ సీజన్ కోసం జిల్లాలో 59,193 టన్నుల ఎరువులు అవసరం అవుతాయని జిల్లా వ్యవసాయ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఇవికాకుండా గత రబీ సీజన్ పూర్తయిన తరువాత జిల్లా వ్యాప్తంగా మిగులు 26,940 టన్నుల నిల్వలను కూడా రైతులకు అందించేలా చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ముందస్తుగా ఏప్రిల్ నెల నుంచే ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచింది. ఏప్రిల్ నుంచి ఖరీఫ్ సీజన్ ముగిసే సెప్టెంబర్ వరకు నెలల వారీగా రైతులకు పంటల సాగు ఉధృతిని బట్టి సరఫరా చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. జిల్లాకు సాధారణ అలాట్‌మెంట్ కింద ముందస్తుగా 59,193 టన్నుల ఎరువులు సిద్ధం చేశారు. వాటిలో కొంత మేర అంటే 17,168 టన్నుల ఎరువులను జిల్లాలోని 500 ఆర్‌బీకేల్లో రైతులకు అందుబాటులో ఉంచనున్నారు.

నెలల వారీగా ఎరువులు అందుబాటులో..

ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు నుంచే రైతులకు ఎరువులను అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం ఆ మేరకు నెలల వారీగా అందజేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఏప్రిల్ నెల నుంచే రైతులకు కావాల్సిన ఎరువులు ఇచ్చేలా చర్యలు చేపట్టింది.

ఖరీఫ్ లక్ష్యం 1,57,334 హెక్టార్లు

ఖరీఫ్–2023 సంవత్సరంలో పంటల సాగు చేసేందుకు లక్ష్యంగా 1,57,334 హెక్టార్లుగా వ్యవసాయ శాఖ నిర్దేశించింది. గత నాలుగేళ్లలో కూడా ఖరీఫ్ సాగు విస్తారంగానే ఉంది. ఖరీఫ్‌లో ప్రధానమైన పంట కంది. జిల్లా వ్యాప్తంగా 80 వేల హెక్టార్లలో కంది సాగు చేస్తారు. ఆ తరువాత స్థానంలో పత్తి పంట 33 వేల హెక్టార్లలో సాగు చేస్తారు. వరి 16 వేల హెక్టార్లలో, సజ్జ 9971 హెక్టార్లు, మొక్కజొన్న 3 వేల హెక్టార్లు, మినుము 3300 హెక్టార్లు, పెసర 1700 హెక్టార్లు, మైనర్ మిల్లెట్స్ 1885 హెక్టార్లు, 2900 హెక్టార్లలో నువ్వు, 2 వేల హెక్టార్లలో ఆముదం, 1725 హెక్టార్లలో పొగాకు, 800 హెక్టార్లలో వేరు శనగ పంటలు సాగు చేస్తారు. మిగతా జొన్న, రాగి, ఉలవలు, పశువుల మేత గడ్డి, పొద్దు తిరుగుడు, చెరకులాంటి పంటలు కూడా సాగు చేస్తారు.



దర్శి ఆర్బీకేలో ఎరువులు పరిశీలిస్తున్న ఆర్బీకే హబ్ ఏఓ మధుబాబుతో ఇతర అధికారులు

జిల్లాలోని ఎరువుల వివరాలు (టన్నుల్లో)

ఎరువుల రకాలు	సాధారణ అలాట్‌మెంట్	ఆర్‌బీకేలకు సరఫరా	గత సంవత్సర నిల్వలు
యూరియా	18,292	6,816	7,900
డీఏపీ	7,179	2,798	2,000
ఎంఓపీ	2,157	185	480
కాంప్లెక్స్	27,574	6,944	15,666
ఎస్‌ఎస్‌పీ	3,991	425	894
మొత్తం	59,193	17,168	26,940

ఏ నెలలో ఎంతంటే..

నెల	టన్నులు
ఏప్రిల్	4,209
మే	4,999
జూన్	9,579
జూలై	11,947
ఆగస్టు	14,289
సెప్టెంబర్	14,170



ఎరువులకు కొరత లేదు
జిల్లాలో ఎరువులకు కొరత లేదు. ఏ రకం ఎరువులు కావాలన్నా రైతులకు అందుబాటులో ఉంచాం. గత సంవత్సరం ఎరువుల మిగులు నిల్వలతో పాటు ఈ సంవత్సరం కొత్త అలాట్‌మెంట్ కలిపి మొత్తం 86,133 టన్నులు అందుబాటులో ఉంచాం. అదేవిధంగా రైతులకు రవాణా ఇబ్బందులు లేకుండా జిల్లాలోని 500 ఆర్‌బీకేల్లో 17,168 టన్నులు ఇప్పటికే అందుబాటులోకి తీసుకొచ్చాం. రైతులు ఎలాంటి పంటలు సాగుచేసుకున్నా ఇబ్బందులు లేకుండా సరఫరా చేయనున్నాం.
– పి.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



అందుబాటులో ఎరువులు
ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు చేసిన పంటలకు ఎరువులు ఎప్పుడూ అందుబాటులో ఉంటున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఏనాడూ ఎరువులకు ఇబ్బంది పడలేదు. గ్రామంలోని ఆర్‌బీకేలోనే ఎరువులు సిద్ధంగా ఉంటున్నాయి. ఎరువులతో పాటు రైతులకు కావాల్సిన అన్ని రకాల సేవలు కూడా త్వరితగతిన అందుతున్నాయి. సీజన్‌కు ముందుగానే ఎరువులు అందుబాటులో ఉంచుతున్నారు.
– ఐ.వెంకటరెడ్డి, రైతు, తాళ్లూరు

ప్రభుత్వ వైద్యశాలల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం

- అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కూడా సిద్ధం
- ఒక్కో ఆరోగ్య కేంద్రాన్ని రూ.1.28 కోట్లతో నిర్మాణం
- అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించిన మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని



ప్రగతికాలనీలో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్, ఒడా చైర్‌పర్సన్ మీనాకుమారి తదితరులు

ఒంగోలు సబర్బన్: ప్రభుత్వ వైద్యశాలల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఒంగోలు నగరంలోని 17వ డివిజన్ ప్రగతి కాలనీలో నూతనంగా నిర్మించిన అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ప్రధాన వైద్యశాలలతో పాటు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను వాటికి దీటుగా రూపొందిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలను, వైద్యశాలలను బాగుచేసేందుకు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. అవసరమైన చోట కొత్త ఆస్పత్రులను కూడా నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఒంగోలు నగరంలో ఒక్కో యూపీహెచ్‌సీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.80 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఆ నిధులకు తోడు ఒంగోలు నగర పాలక సంస్థ నుంచి మరో రూ.48 లక్షలు జత చేసి మొత్తం రూ.1.28 కోట్లతో ఈ ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించినట్లు వివరించారు. ఈ నెలలోనే ఒంగోలు నగరంలోని మిగతా నాలుగు ఆరోగ్య కేంద్రాలను కూడా పూర్తి చేస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు స్థానికంగానే అందేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. వైద్యులు కూడా ప్రజల మన్ననలు పొందేలా చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇతర ఏ విధమైన సాయం కావాలన్నా వ్యక్తిగతంగా తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ప్రజలకు భరోసా ఇచ్చారు. కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ మాట్లాడుతూ వైద్యరంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పేదలపైన పైసా కూడా భారం లేకుండా పూర్తి స్థాయిలో వారికి ఆరోగ్య భద్రత కల్పిస్తున్నామన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో వైద్యానికి ప్రజలు ఎక్కువగా ఖర్చు చేస్తున్నందున వారికి చేరువలోనే ఉచితంగా వైద్య సేవలు లభించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఒంగోలు నగరంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న 5 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించి రోగులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అనారోగ్యాన్ని ప్రారంభ దశలోనే గుర్తించటానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 63 రకాల పరీక్షలు నిర్వహించేలా, 172 రకాల మందులు అందుబాటులో ఉంచేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. రోగులకు డబ్ల్యూహెచ్‌ఓ ప్రమాణాలతో మందులు ఇస్తున్నట్లు వెల్లడించారు. వైద్య పరీక్షల ఫలితాలను కూడా వారి మొబైల్ నంబర్‌కు పంపేలా ఆధునిక సదుపాయాలు కల్పించామన్నారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా వైద్య సిబ్బంది కూడా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, ఊడా చైర్మన్ సింగరాజు మీనా కుమారి, ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కఠారి శంకర్, గోలి తిరుపతిరావు, బొట్ల సుబ్బారావు, పాలపర్తి సుబ్బారావు, దుడ్డు సతీష్, మున్సిపల్ ఇంజినీర్ కే.మాల్యాద్రి, 17వ డివిజన్ కార్పొరేటర్ నాగం శేషగిరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఘనశ్యాం, కార్పొరేటర్లు తాడి కృష్ణలత, చింతపల్లి గోపీచంద్, యనమల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాల్లో 'నవరత్నాల' వెలుగులు

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



లబ్ధిదారులకు పథకాల గురించి వివరిస్తున్న పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక సచివాలయం–2 పరిధిలోని పుల్లలచెరువు రోడ్డు, గాయత్రి థియేటర్ ప్రాంతాల్లో సోమవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రభుత్వ పరంగా ఏమేరకు లబ్ధి చేకూరిన విషయాన్ని లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగనన్న ఎన్నికల ముందు చేసిన సుదూర పాదయాత్రలో పేదల కష్టాలు తెలుసుకొని చలించిపోయారని, ఆ కష్టాలు తీర్చేందుకు ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాల పథకాన్ని ప్రవేశపెట్టి దిగ్విజయంగా అమలు పరుస్తున్నారని అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు చెందిన కుటుంబాలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని, రూ.7 లక్షల వరకు లబ్ధి పొందిన కుటుంబాలు ఉన్నాయని అన్నారు. జగనన్న కాలనీల ద్వారా పేదోళ్ల ఇంటి కల నెరవేర్చుతున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన కొనియాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేసేందుకు ఏమీలేక ప్రధాన ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు సంక్షేమ పథకాలపై విరుచుకు పడుతున్నారని విమర్శించారు. ఈ పథకాలను రద్దు చేస్తామని, కొత్త పథకాలు ప్రవేశపెడతామని ఎక్కడా అనడంలేదని, ఆ పథకాలు కొనసాగిస్తామని చెప్పడం సిగ్గుచేటని ఆయన వ్యంగ్యంగా అన్నారు. గత ప్రభుత్వ కాలంలో అనేక స్కాంలు జరిగాయని, వాటిపై విచారణ చేసేందుకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిందని అన్నారు. 2014లో చంద్రబాబు చేసిన వాగ్దానాలు నెరవేర్చకుండా ప్రజలకు మోసం చేశారని, 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీని నామరూపాలు లేకుండా చేశారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 స్థానాలు వైఎస్సార్ సీపీకి దక్కుతాయని, ఆ దిశగా తామందరం కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయా ప్రాంతాల్లో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో బి.వి.ఎస్. సాయికుమార్, తహసీల్దార్ కె.దాస్, హౌసింగ్ డీఈ సురేష్ బాబు, పీఆర్ డీఈ బి.సుబ్బారెడ్డి, ఈవో ఈదుల రాజశేఖరరెడ్డి, ఎంఈవో పి.ఆంజనేయులు, ఏవో పి.వెంకటేశ్వర్లు, ఏఈలు శ్రీకాంత్, అంజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, మండల పార్టీ అధ్యక్షుడు కె.ఓబుల్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, ఆర్య వైశ్య సంఘం నాయకులు ఐ.వి.సుబ్బారావు, యక్కలి భాగ్యారావు, కందూరి కాశీవిశ్వనాథ్, పప్పర్తి శ్రీనివాసులు, మొగలి సుబ్బారావు, సర్పంచ్‌లు అరుణాబాయి, సుబ్బారెడ్డి, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు

- ఎంపీడీఓలు, ఏపీఓలు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలి
- ఫీల్డ్ అసిస్టెంట్లు పనిజరిగే ప్రాంతాల్లో 6 గంటలకే ఉండాలి
- ఉపాధి హామీ పనులపై సమీక్షించిన కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్

ఒంగోలు సబర్బన్: ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై వేటు తప్పదని కలెక్టర్ ఏఎస్. దినేష్ కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక డ్వామా జిల్లా కార్యాలయంలో సోమవారం సాయంత్రం అధికారులు, సిబ్బందితో ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు ఉదయం 6 ఆరుగంటలకు పనులు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించిన ఫీల్డ్ అసిస్టెంట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇచ్చిన లక్ష్యాలను జూన్ చివరి నాటికి కచ్చితంగా పూర్తి చేయాలన్నారు. ఎంపీడీఓలు, ఏపీఓలు క్షేత్ర స్థాయిలో జరిగే పనులను నిరంతరం సందర్శించి, సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, ఎప్పటికప్పుడు ఉపాధి పనులను సమీక్షించాలని ఆదేశించారు. మండల స్థాయి నుంచి గ్రామాల్లో జరిగే పనుల తీరును సీనియర్ మేట్ స్థాయి వరకు మాట్లాడుతూ ఈ పనులు మెరుగ్గా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోజువారీ ప్రగతి నివేదికను తనకు పంపాలన్నారు. జిల్లా కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయిలో జరిగే ఉపాధి పనుల తీరును గంట గంటకీ నివేదిక తీసుకోవాలని డ్వామా పీడీ శీనారెడ్డిని ఆదేశించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్క కూలీ పనికి హాజరయ్యేలా ప్రోత్సహించాలని చెప్పారు. జాబ్ కార్డు ఉండి కూడా పనులకు హాజరుకాని కూలీలను గుర్తించి వారితో మాట్లాడి వారు కూడా పనులకు వచ్చేలా ప్రోత్సహించాలన్నారు. కూలీల హాజరును ఎప్పటికప్పుడు ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. వారికి సకాలంలో డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓలు ఫీల్డ్ అసిస్టెంట్లకు ఖాళీలకు సంబంధించిన ప్రతిపాదనలను త్వరితగతిన పంపాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ శీనారెడ్డి, డిప్యూటీ సీఈఓ హనుమంతరావుతో పాటు ఎంపీడీఓలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

క్రీడాకారులకు కలెక్టర్ అభినందనలు



విజేతలైన క్రీడాకారులకు అభినందనలు తెలుపుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: ఈ నెల మొదటి వారంలో తిరుపతిలో జరిగిన ఏపీ సీఎం కప్ 2023 చాంపియన్‌షిప్ క్రీడల్లో ప్రతిభ చూపిన జిల్లా క్రీడాకారులను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. పురుషుల కబడ్డీ, మహిళల ఖోఖో, పురుషుల ఖోఖో, పురుషుల వాలీబాల్ విభాగాల్లో జిల్లా క్రీడా బృందాలు విజేతలుగా నిలిచాయి. పురుషుల అథ్లెటిక్స్ విభాగంలో 3 బంగారు పతకాలు, మహిళల వెయిట్ లిఫ్టింగ్‌లో 3 రజిత, 1 కాంస్య పతకం, పురుషుల బాక్సింగ్‌లో ఒక రజిత, ఒక కాంస్య పతకం జిల్లాకు దక్కాయి. ఈ టోర్నమెంట్‌లో ఓవరాల్ ప్రదర్శలో జిల్లా 3వ స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో సోమవారం ప్రకాశం భవనంలో క్రీడాకారులు వారు సాధించిన మెడల్స్, కప్‌లతో కలెక్టర్‌కు చూపారు. విజేతలను అభినందించి మరింత సాధనతో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. దీనిలో స్టెప్ సీఈఓ బాబురావు, జిల్లా చీఫ్ కోచ్ రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నిర్దిష్ట గడువులో సమస్యలు పరిష్కరించాలి

- సమస్యల పరిష్కారంలో ప్రజల సంతృప్తి స్థాయి పెరగాలి
- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- స్పందనలో కలెక్టర్ దినేష్ కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: సమస్యలు పరిష్కరించడంలో ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా పనిచేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో దూర ప్రాంత ప్రజల నుంచి ఫోన్ ద్వారా సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలను నిర్దిష్ట గడువులో చిత్తశుద్ధితో సహేతుకంగా పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యలు పునరావృతం కాకుండా పరిష్కరించాలన్నారు. పరిష్కారం చూపలేని సమస్యలను అర్జీదారులకు వివరించాలన్నారు. దీనిలో జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు, డీఆర్‌ఓ ఆర్ శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎంపీఎస్ లోకేశ్వరరావు, చెన్నయ్య, సరళావందనం, గ్లోరియా, వరకుమార్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

➤ మద్రిపూడి మండలం అయ్యప్పరాజుపాలెంకు చెందిన రామారావు తన భూమి వేరే వారి పేరుతో ఆన్‌లైన్ చేసి బ్యాంకు రుణం కూడా తీసుకున్నారని ఫిర్యాదు చేశాడు. పరిశీలించి తన భూమిని తన పేరుతో ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆన్‌లైన్ చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు.

➤ మార్కాపురం మండలం వేములపాడు గ్రామానికి చెందిన మాల్లారెడ్డి డయల్ యువర్ కలెక్టర్‌కు ఫోన్ చేసి చుక్కల భూమి జాబితాలో తన భూమి ఉందని తెలిపారు. పరిశీలించి తన పేరును చుక్కల భూమి జాబితాలో తొలగించాలని కోరారు. ఆమేరకు సంబంధిత తహశీల్దారును తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

➤ అద్దంకి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన దాట్ల రవితేజ స్పందనలో కలెక్టర్‌ను కలిసి తన తండ్రి ప్రజా రవాణా సంస్థలో పనిచేస్తూ మరణించాడని, కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు.

క్లుప్తంగా

అక్రమ గ్యాస్ వ్యాపారులపై కేసుల నమోదు



గ్యాస్ సిలిండర్‌లను పరిశీలిస్తున్న పౌరసరఫరాల శాఖ సిబ్బంది

ఒంగోలు అర్బన్: వంట గ్యాస్ సిలిండర్ నుంచి చిన్న గ్యాస్ సిలిండర్‌లకు అక్రమంగా గ్యాస్‌ను ఎక్కించి అక్రమ వ్యాపారం చేస్తున్న వారిపై పౌర సరఫరాల శాఖ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించి 6ఏ కింద కేసుల నమోదు చేశారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు బృందాలు గానుగపాలెం ప్రాంతంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. సీఎస్‌డీటీలు అశోక్, రామనారాయణరెడ్డి ఇతర సిబ్బంది అక్రమ వ్యాపారులు ముగ్గురుని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. 16 గ్యాస్ సిలిండర్లు, అక్రమ రీ ఫిల్లింగ్‌కు వినియోగించే పరికరాలు, మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. వీఆర్‌ఓ కృష్ణారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

ఒంగోలు: పదో తరగతి అడ్వాన్స్, సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 2వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17వ తేదీ లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని, రూ.50 అపరాధ రుసుంతో ఈనెల 22వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. 3 సబ్జెక్టుల లోపు రూ.110, అంతకు మించిన సబ్జెక్టులకు రూ.125 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. 2వ తేదీ తెలుగు, కాంపోజిట్ కోర్సు పేపర్ -1 పరీక్ష, 3వ తేదీ హిందీ, 5న ఆంగ్లం, 6న గణితం, 7న సైన్స్, 8న సోషల్ స్టడీస్, 9న కాంపోజిట్ కోర్సు ద్వితీయ పేపర్, ఓరియంటల్ పేపర్-1 పరీక్ష నిర్వహిస్తారు. 10న ఓరియంటల్ పేపర్ 2 పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు.

బాలికతో వృద్ధుడి అసభ్య ప్రవర్తన

పెద్దారవీడు: మనవరాలి వయసున్న బాలిక(9)తో ఓ వృద్ధుడు అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన పెద్దారవీడులో చోటుచేసుకోగా సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దారవీడులో అంకాలమ్మ ఆలయం వద్ద ఉన్న తన మనవరాలిని సైకిల్‌పై ఎక్కించుకుని గ్రామంలో దించాలని వెన్నా చెంచిరెడ్డి అనే వృద్ధుడికి ఓ మహిళ చెప్పింది. దీంతో బాలికను సైకిల్‌పై ఎక్కించుకుని గ్రామానికి బయలుదేరిన వృద్ధుడు మార్గమధ్యంలో చెరువులోకి బాలికను తీసుకెళ్లాడు. ఈలోగా ఇంటికి చేరుకున్న మహిళకు తన మనవరాలు కనిపించకపోవడంతో వెతుకుతూ వెళ్లింది. ఈ సమయంలో చెరువు వద్ద బాలికతో వృద్ధుడు కనిపించాడు. తనతో వృద్ధుడు ప్రవర్తించిన తీరును ఆ బాలిక తన అమ్మమ్మకు చెప్పింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.రాజేష్ తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ముండ్లమూరు: మండల కేంద్రమైన ముండ్లమూరులో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.సంపత్‌కుమార్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. ముండ్లమూరులో ఆదివారం నిర్వహించిన కొలుపులకు సంతమాగులూరుకు చెందిన కారసాని వెంకటరెడ్డి(42) వచ్చాడు. జాతర సందర్భంగా మద్యం సేవించాడు. అయితే గ్రామానికి శివారున ఉన్న చెట్టు దగ్గర సోమవారం ఉదయం శవమై కనిపించాడు. మృతదేహం వద్ద మద్యం బాటిల్ ఉంది. సమీపంలోని ద్విచక్ర వాహనం ఆధారంగా మృతుడిది సంతమాగులూరుగా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలాన్ని దర్శి సీఐ రామకోటయ్య పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సాయంతో ఆధారాలు సేకరించారు. వీఆర్వో కావూరి దయానందం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విషమ 'పరీక్ష'

- జీఈడీ పరీక్ష రాసేందుకొచ్చి బేస్తవారిపేట సమీపంలో ప్రమాదానికి గురైన ఒడిశా విద్యార్థులు
- రెండు ఆటోలను కారు ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి
- మరో ముగ్గురికి తీవ్రంగా, ఆరుగురికి స్వల్పంగా గాయాలు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న బీఈడీ విద్యార్థులు

బేస్తవారిపేట: ఎదురుగా వచ్చిన రెండు ఆటోలను కారు ఢీకొట్టిన సంఘటనలో ఒకరు మృతిచెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు, ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడు, క్షతగాత్రులంతా ఒడిశాకు చెందిన బీఈడీ విద్యార్థులు. ఈ ఘటన బేస్తవారిపేట మండల కేంద్రంలోని పాత సినిమాహాల్ సెంటర్ సమీపంలో తోకపల్లె-కడప హైవే రోడ్డు మూలమలుపులో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశాకు చెందిన ఏడుగురు విద్యార్థులు కంభంలోని ఓ బీఈడీ కాలేజీలో అడ్మిషన్ పొందారు. మంగళవారం బీఈడీ పరీక్షలు రాసేందుకు ఒడిశా నుంచి బయలుదేరి సోమవారం ఉదయం 3.30 గంటల సమయంలో కంభం రైల్వే స్టేషన్‌లో దిగారు. వీరంతా రెండు ఆటోల్లో బేస్తవారిపేట లాడ్జిలో బసచేసేందుకు వస్తున్నారు. మార్గమధ్యంలో పాత సినిమాహాల్ సెంటర్ మూలమలుపులో ఆటోలకు ఎదురుగా వస్తున్న ఒక కారు ముందు ఆటోను ఒక వైపు ఢీకొట్టి వేగంగా వెళ్లి మరో ఆటోను ముందు భాగంలో ఢీకొట్టింది. దీంతో రెండు ఆటోలు బోల్తాపడ్డాయి. వెనుక ఆటోలో ప్రయాణిస్తున్న ఒడిశా రాష్ట్రం జయచంద్రాపూర్‌కు చెందిన అలోక్‌రంజన్‌స్వాన్ (25) తీవ్రంగా గాయపడటంతో వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందాడు. గాయపడిన విక్రమాదిత్యమాలిక్, సరోజనిమాలిక్, బిజయలక్ష్మీ మాలిక్, గర్నియాఇలానీ, లీసారాణిదేష్, సనాలిసుచిత్ర, రామ్‌శంకర్‌మేర్, ఇద్దరు ఆటో డ్రైవర్లు వి.రామారావు, వై.ప్రవీణ్‌కుమార్‌ను 108లో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఇద్దరు ఆటోడ్రైవర్లు, విక్రమాదిత్యామాలిక్‌ను మార్కాపురం జిల్లా వైద్యశాలలో చేర్చారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాధవరావు తెలిపారు.



ప్రమాదానికి కారణమైన కారు



మృతి చెందిన రంజాన్‌స్వాన్

ప్రైజ్‌మనీ పేరుతో కుచ్చుటోపీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్

- స్పందనలో ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు
- ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: నగరానికి చెందిన ఓ కుటుంబం ఆన్‌లైన్లో మీషో షాపింగ్ చేస్తుండగా వారికి రూ.12.50 లక్షల ప్రైజ్‌మనీ గెలుచుకున్నట్టు ఒక మెసెజ్ వచ్చింది. బహుమతి నగదు పొందేందుకు రిజిస్ట్రేషన్ చార్జీలు, కేంద్ర ప్రభుత్వ పన్నులు కలిపి వెంటనే రూ.50వేలు చెల్లించాలని, మీషో ఫోన్‌పే నంబర్ అంటూ ఒక నంబర్ మెసెజ్ పెట్టారు. ఇది నిజం అని నమ్మిన సదరు కుటుంబం రూ.50 వేలు చెల్లించారు. ఆ తరువాత మీ ప్రైజ్‌మనీ రెట్టింపు అయిందంటూ మరొక మెసెజ్ వచ్చింది. ఇందుకు గాను అదనంగా మరికొంత సొమ్ము చెల్లించాలని చెప్పడంతో వారు అలాగే మరికొంత డబ్బును ఫోన్‌పే ద్వారా చెల్లించారు. అయితే ప్రైజ్‌మనీ మాత్రం ఇవ్వలేదు. దీంతో ప్రైజ్‌మనీ ఇవ్వాలని అడిగితే వారి నుంచి సమాధానం రాకపోవడంతో మోసం జరిగినట్లు గ్రహించారు. వెంటనే సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే స్పందనకు వచ్చి ఎస్పీ మలికాగర్గ్‌కు ఫిర్యాదు చేశారు. చీటీల పేరుతో తన వద్ద నుంచి రూ.15 వేలు కట్టించుకొని చీటి డబ్బులు ఇవ్వడం లేదంటూ ఒంగోలు నెహ్రూనగర్‌కు చెందిన మహిళ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. స్పందనలో మొత్తం 99 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులు అందుకున్న ఎస్పీ ఆయా పోలీసుస్టేషన్ అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..ఆన్‌లైన్ మోసాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముక్కు మోహం తెలియని వ్యక్తులు చేసే మెసెజ్‌లు నమ్మి డబ్బులు పోగొట్టుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (క్రైమ్), ఎస్‌వీ శ్రీధర్‌రావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఐసీసీఆర్ సీఐ దుర్గా ప్రసాద్, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ పాల్గొన్నారు.

చోరీ కేసు ఛేదించిన పోలీసులు

- ఒంగోలు గాంధీ రోడ్డులోని బంగారు దుకాణంలో గత నెల 21న చోరీ
- ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిందితుడు, అతని సోదరుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 200 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మలికా గర్గ్



చోరీ సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ మలికా గర్గ్, ఏఎస్పీ(క్రైమ్) శ్రీధర్‌రావు, డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి

ఒంగోలు టౌన్: ఒంగోలు నగరంలోని గాంధీ రోడ్డులో గత నెల 21వ తేదీ రాత్రి ఓ బంగారు దుకాణంలో చోరీకి పాల్పడిన దొంగను పోలీసులు అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఎస్పీ మలికా గర్గ్ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు జిల్లా సీతారామపురం గ్రామానికి చెందిన 6వ తరగతి వరకు చదువుకున్న ఓ బాలుడు కుటుంబ ఆదాయం అంతంత మాత్రంగా ఉండటంతో దొంగగా మారాడు. చిన్నచిన్న దొంగతనాలు చేయడం మొదలెట్టాడు. 2021లో సీతారామపురం గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి ఇంట్లో చోరీకి ప్రయత్నించాడు. ఇది గమనించిన ఇంటి యజమాని ఆ బాలుడి ఫొటో తీశాడు. దీంతో ఆగ్రహానికి గురైన సదరు బాలుడు శ్రీకాంత్‌పై కత్తెరతో దాడి చేసి గాయపరిచాడు. ఆ కేసులో అతడిని తిరుపతిలోని జువైనల్ హోంలో చేర్చారు. అక్కడి నుంచి వచ్చిన ఆ బాలుడు 2022లో మళ్లీ దొంగతనానికి పాల్పడ్డాడు. పోలీసు కేసు నమోదు కావడడంతో గ్రామం నుంచి పారిపోయి పామూరు చేరుకున్నాడు. గత నెల 21వ తేదీ రాత్రి గాంధీ నగర్‌లోని పెట్లుగాని శ్రీనివాసరావుకు చెందిన శ్రీశాంతి జ్యూవెలరీ షాప్‌లో చోరీకి పాల్పడ్డాడు. పైకప్పు గుండా లోపలికి ప్రవేశించిన బాలుడు గ్రౌండ్‌ఫ్లోర్‌లోని దుకాణంలో 70 గ్రాముల బరువు కలిగిన 20 జతల చెవి కమ్మలు, పాత ఆభరణాల పెట్టెలో దాచి పెట్టిన 130 గ్రాముల బంగారు నగలు, క్యాష్ కౌంటర్లో ఉన్న 50 వేల రుపాయల నగదు దొంగలించాడు. తన వద్ద ఎవరూ బంగారు ఆభరణాలు కొనకపోవడంతో తన సోదరుడితో కలిసి విజయవాడకు వెళుతుండగా పక్కా సమాచారంతో వన్‌టౌన్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. స్వల్ప కాలంలోనే ఈ కేసును ఛేదించిన ఒంగోలు వన్ టౌన్ సీఐ టి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ యూవీ కృష్ణయ్య, ఏఎస్సై కె.సురేష్, హెడ్‌కానిస్టేబుళ్లు జి.విజయ్, షేక్ ఖాజావలి, కె.చక్రవర్తి, కానిస్టేబుళ్లు ఎం.అనిల్, కె.శ్రీను తదితరులను ఎస్పీ మలికా గర్గ్ అభినందించి ప్రశంస పత్రాలు అందజేశారు.

ఇరువర్గాల ఆమోదంతోనే కేసుల పరిష్కారం

- ఈనెల 13న మెగా లోక్ అదాలత్‌కు కక్షిదారులు సహకరించాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి

ఒంగోలు: ఇరువర్గాల ఆమోదంతోనే లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి పేర్కొన్నారు. ఈనెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కక్షిదారులు సహకరించాలని కోరారు. సోమవారం జిల్లా కోర్టులోని తన చాంబర్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ప్రధాన న్యాయమూర్తి మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా అన్ని న్యాయస్థానాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కేసుల పరిష్కారానికి 29 బెంచ్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాజీపడేందుకు అర్హత కలిగిన అన్ని క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా పరిహారపు చెల్లింపు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, వివాహ సంబంధ వ్యాజ్యాలు, అన్ని రకాల సివిల్ కేసులను కక్షిదారుల ఆమోదంతో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులు ఉన్నవారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని వ్యాజ్యాలను పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసుల్లో అప్పీలుకు వెళ్లే అవకాశం లేదని, కోర్టుల్లో చెల్లించిన ఫీజును తిరిగి పొందవచ్చని స్పష్టం చేశారు. న్యాయస్థానాలకు ప్రత్యక్షంగా హాజరుకాలేని కక్షిదారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కూడా వ్యాజ్యాలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి సహకరించాలని పోలీసులు, ప్రభుత్వ అధికారులు, న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. అర్హత కలిగిన న్యాయవాదులు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పోస్టులకు గడువు తేదీని ఈనెల 18వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారురు. న్యాయవాదుల ఎంపికలో పైరవీలకు తావులేదని, పూర్తిగా ప్రతిభ ఆధారంగానే నియమిస్తామని జిల్లా ప్రధాన న్యాయూర్తి స్పష్టం చేశారు.

కలకలం రేపిన టీచర్ సూసైడ్ నోట్!

- మార్కాపురం చెరువు కట్ట వద్ద చెప్పులు, దుస్తులు
- చివరకు డ్రైవర్స్ కాలనీలో గుర్తించిన పోలీసులు



ఇంటి వద్ద చికిత్స పొందుతున్న లక్ష్మయ్య

మార్కాపురం: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న గణిత ఉపాధ్యాయుడు రాజారపు లక్ష్మయ్య ఆత్మహత్య చేసుకుంటున్నట్లు రాసిన ఓ లేఖ సోషల్‌మీడియాలో చక్కర్లు కొట్టడం సంచలనం రేపింది. తనకు డబ్బు ఇవ్వాల్సిన వారు ఇవ్వకపోవడం, మరో వైపు అప్పులిచ్చిన వ్యక్తులు వెంటాడటంతో మార్కాపురం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నానని, తన మృతదేహం దొరికితే కాల్చివేయాలని లేఖ రాసి స్నేహితుల గ్రూపులో సోమవారం వేకువజామున పోస్టు చేశాడు. తన ఫొటో, మాస్టర్ కార్డు, ముఖ్యమైన వారి ఫోన్ నంబర్లు, సూసైడ్‌నోట్, చెప్పులు చెరువు గట్టుపై ఆకుపచ్చ సంచిలో ఉంచుతున్నట్లు లేఖలో పేర్కొన్నాడు. కాగా ఉదయం 7 గంటలకు లేఖను చూసిన పలువురు పోలీసులకు సమాచారం అందించి చెరువు కట్ట దగ్గరకు వెళ్లారు. అక్కడ చెప్పులు, సంచి లభ్యమయ్యాయి. ఈతగాళ్ల సాయంతో చెరువులో గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. సమీపంలోని ప్రాంతాలను జల్లెడ పట్టగా డ్రైవర్స్ కాలనీ వద్ద లక్ష్మయ్య ఆచూకీ లభించిందని సీఐ భీమానాయక్ తెలిపారు. తన ఇంటికి చేర్చి సెలైన్ బాటిల్ ఎక్కించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య

యర్రగొండపాలెం: పదో తరగతి పాస్ కాలేదని మనస్తాపం చెంది విద్యార్థి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని బోయలపల్లె గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన రాహుల్ దిలీప్(16) శనివారం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో ఫెయిల్ అయ్యాడు. దీంతో మనస్తాపంతో పురుగుమందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించి చికిత్స చేయిస్తుండగా సోమవారం మృతి చెందాడు.

కొట్లాట కేసులో నిందితులకు రిమాండ్

దర్శి: వీరాయపాలెం గ్రామంలో గత రెండు రోజుల క్రితం పొలం తగాదా విషయంలో కొట్టుకున్న ఇరువర్గాల వారిని ఎస్సై రామకృష్ణ దర్శి ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వద్ద సోమవారం హాజరుపరిచారు. నిందితులైన మెరికపూడి వెంకటేశ్వర్లు, మెరికపూడి ప్రసాద్‌లకు 14 రోజుల రిమాండ్ విధించారు.

బాధ్యతలు చేపట్టిన డీఎస్పీలు



ఎస్పీ మలికా గర్గ్‌కు మొక్క అందజేస్తున్న డీఎస్పీలు నారాయణస్వామిరెడ్డి, అశోక్‌వర్థన్, రామరాజు

ఒంగోలు టౌన్: ఒంగోలు, దర్శి, కనిగిరి డీఎస్పీలు సోమవారం బాధ్యతలు చేపట్టారు. దర్శి డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న వి.నారాయణస్వామిరెడ్డి ఒంగోలు డీఎస్పీగా, అలాగే ఒంగోలు డీఎస్పీ టి.అశోక్‌వర్ధన్ దర్శి డీఎస్పీగా, జిల్లాల పునర్విభజన అనంతరం నూతనంగా ఏర్పడిన కనిగిరి సబ్‌డివిజన్ డీఎస్పీగా ఆర్.రామరాజు ఆయా పోలీసు కార్యాలయాల్లో రిపోర్టు చేశారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మలికా గర్గ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలి

ఒంగోలు టౌన్: ప్రతిఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అన్నారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రాచర్ల వెంకట సుశీల, డీపీవో జి.వి.నారాయణరెడ్డి, డీఈవో పి.రమేష్, డిప్యూటీ డీఈవో అనితారోజ్ రాణి, ఎంఈవో కిశోర్‌బాబు, ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రేపు పాలిసెట్ ప్రవేశ పరీక్ష

ఒంగోలు: పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (పాలిసెట్)-2023ను ఈ నెల 10వ తేదీ నిర్వహించేందుకు జిల్లాలో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. 4,700 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం 11 గంటల తర్వాత ఒక్క నిముషం లేటుగా వచ్చినా లోపలకు అనుమతించేది లేదని ఇప్పటికే అధికారులు స్పష్టం చేశారు.

విద్యుత్ సిబ్బందిపై దాడి



దాడిలో ధ్వంసమైన విద్యుత్ రీడింగ్ మిషన్

ముండ్లమూరు: మండలంలోని భీమవరం గ్రామంలో సోమవారం విద్యుత్ సిబ్బందిపై కొందరు దాడి చేశారని విద్యుత్ శాఖ ఏఈ భూరాజు తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా సోమవారం జూనియర్ లైన్‌మెన్ కూడలి నవీన్, రీడింగ్ తీసే యువకుడు దత్తుతో కలిసి ఎస్సీ కాలనీలో రీడింగ్ తీస్తుండగా కాలనీకి చెందిన గద్దల దావీదు, వరుణ్ తేజ్, అక్కమ్మలు రీడింగ్ తీయవద్దన్నారు. అయితే మా పని మేం చేయాలి కదా అని ప్రశ్నించగా దాడి చేసి రీడింగ్ మిషన్, సెల్‌ఫోన్ ధ్వంసం చేశారు. దీంతో విద్యుత్ సిబ్బందితో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న ఏడీఈ పిచ్చయ్య ముండ్లమూరు చేరుకొని సిబ్బందిని పరామర్శించారు.